సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 11 । మార్చి । 2024



గంజాయి స్వాధీనం
ఇద్దరు వ్యక్తులు కారులో నిషేధిత గంజాయిని తరలిస్తుండగా జూలూరుపాడు పోలీసులు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. 8లో



కొత్త సర్కార్‌పైనే ఆశలు..!
ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, మరో రెండు కొత్త మండలాలు ఏర్పాటుపై ప్రజలు కొత్త సర్కారుపైనే ఆశలు పెట్టుకున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 22°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఉష్ణోగ్రతలు పెరిగి, మధ్యాహ్నం అధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామివారి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం సందర్భంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. కాగా ఆదివారం కావడంతో భక్తులు స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. పూజాది కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ ధర్మకర్తల మండలి డైరెక్టర్లు చింతనాగరాజు, సువాలి, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్షకు 380 మంది


ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ పొందేందుకు నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 380 మంది అభ్యర్థులు హాజరయ్యారని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, స్టడీ సర్కిల్ సెక్రటరీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఉచిత శిక్షణ కోసం 539 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 380 మంది మాత్రమే హాజరయ్యారని, 159 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలు త్వరలో వెల్లడిస్తామని, మెరిట్ ఆధారంగా 100 మందిని శిక్షణకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 17 వరకు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టడీసర్కిల్ డైరెక్టర్ సీహెచ్ వీరభద్రం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీరుల్లా, పరీక్ష కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, ఎన్.ప్రియాంక, డీవీఎల్ఎన్ జయశ్రీ, ఎ.లిఖిత తదితరులు పాల్గొన్నారు.

మిథిలా పునర్నిర్మిస్తే..

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత భద్రాచలంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరగలేదు. పైగా గత ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు అమలుకు నోచుకోలేదు. అయితే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. నేడు భద్రాచలం ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో సమీక్ష సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియాన్ని ప్రస్తుత అవసరాలకు తగినట్లు పునర్నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





యాంఫీ థియేటర్ నమూనా, (ఇన్‌సెట్) రామాలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియం

పర్వదినాల్లో అందరికీ రామయ్య దర్శనం

- ముక్కోటి, నవమిలకు భక్తజనసంద్రంగా భద్రాద్రి
- మిథిలా స్టేడియంలో స్పష్టంగా కనిపించని కల్యాణవేదిక
- వీవీఐపీ, వీఐపీల గ్యాలరీల భక్తులకే కనుల విందు
- అరకొరగానే సామాన్య భక్తులకు రామయ్య దర్శనం

పర్వదినాల్లో లక్షకు మించి భక్తుల రాక

లక్ష్మణ సమేత సీతారాములు కొలువై ఉన్న భద్రాచలం క్షేత్రానికి పండగలు, సెలవు రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి పర్వదినాల్లో లక్షకు పై చిలుకు భక్తులు భద్రాచల క్షేత్రానికి వస్తారు. దీంతో సీతారాముల కల్యాణం, ఉత్తర ద్వారంలో దేవేరులను దర్శించుకోవాలన్నా మిథిలా స్టేడియం, దాని చుట్టూ ఉన్న ప్రాంగణం కీలకం. స్టేడియంతోపాటు పరిసర ప్రదేశాలను సెక్టార్లుగా విభజిస్తారు. దాదాపు నలభై ఏళ్ల కిందట అప్పటి అవసరాలకు తగ్గట్టుగా రూపొందించిన ప్రణాళిక నమూనానే కొంచెం అటు ఇటుగా ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రస్తుత అవసరాలను ఈ ఏర్పాట్లు తీర్చలేకపోతున్నాయి. కల్యాణ మంటపం ఎత్తు, ఉత్తర ద్వారం, మిథిలా స్టేడియంలోని గ్యాలరీల మధ్య పొంతన లేదు. దీంతో ముక్కోటి, శ్రీరామనవమి పర్వదినాల్లో వీవీఐపీ, వీఐపీ సెక్టార్లలో ఉన్న వారికి తప్పితే మిగిలిన సెక్టార్లలో ఉన్న భక్తులకు కనులారా సీతారాములను దర్శించుకోవడం సాధ్యం కావడం లేదు. ఎక్కడెక్కడి నుంచో వ్యయప్రయాసలకు ఓర్చి భద్రాచలం చేరుకున్న భక్తులకు సీతారాములను తనివితీరా దర్శించుకోవడం దుర్లభంగా మారింది.

పొగడ చెట్టు నీడన మొదలై

శ్రీరామదాసు కాలంలో భద్రాచల ఆలయం ప్రాంగణంలో ఉన్న పొగడ చెట్టు నీడలో సీతారాముల కల్యాణం నిర్వహించేవారని ఆలయ పండితులు చెబుతుంటారు. ఆ తర్వాత కాలంలో భక్తుల సంఖ్య పెరగడంతో పొగడ చెట్టు నుంచి చిత్రకూట మండపంలోకి పెళ్లి వేదికను మార్చారు. గోదావరిపై వంతెన నిర్మాణం పూర్తయ్యాక భద్రాచలం వచ్చే భక్తుల సంఖ్య వేలల్లోకి చేరుకుంది. చిత్రకూట మండపంలో అంతమందికి పెళ్లి చూడటం కష్టం కావడంతో ఆలయ ప్రాంగణం నుంచి బయట కల్యాణం జరిపించాలని నిర్ణయించారు. దీంతో ఉత్తర ద్వారానికి ఎదురుగా నవమి కల్యాణం కోసం ప్రత్యేకంగా మండపాన్ని 1964లో నిర్మించారు. సుమారు రెండు దశాబ్దాలపాటు ఎత్తైన కల్యాణ మండటంతో పెళ్లి తంతు జరుగుతుండగా చుట్టూరా భక్తులు చేరి చూసేవారు.

1988 నుంచి మిథిలా స్టేడియం

గోదావరిపై వంతెన అందుబాటులోకి రావడం, రవాణా సౌకర్యాలు మెరుగవడంతో నవమి కల్యాణానికి వచ్చే భక్తుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1988లో కల్యాణ మండపం చుట్టూ భక్తులు కూర్చుని చూసేందుకు వీలుగా గ్యాలరీని నిర్మించారు. అప్పటి నుంచి కల్యాణ వేడుకలు జరిగే ప్రదేశాన్ని మిథిలా స్టేడియంగా పిలుస్తున్నారు. ఆ తర్వాత స్టేడియంలో గ్యాలరీపై ఎండా, వాన పడకుండా షెడ్డు నిర్మించారు. అయితే ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా మిథిలా స్టేడియం సేవలు అందివ్వలేకపోతోంది. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలంలో స్థల లభ్యత కొరత ఏర్పడింది. దీంతో ఉన్న స్థలంలోనే ఇటు శ్రీరామనవమి, అటు ముక్కోటితోపాటు ఇతర పర్వ దినాల్లో వచ్చే భక్తులకు అందుబాటులో ఉన్న స్థలంలోనే ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది.

యాంఫీ థియేటర్ తరహాలో..

భద్రాచలానికి భక్తులు ఎక్కువగా వచ్చే శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి పండుగలను దృష్టిలో పెట్టుకుని మిథిలా స్టేడియంలో మార్పులు చేయాలని లేదా పునర్ నిర్మాణం చేయాలని భక్తులు కోరుతున్నారు. ఉత్తర ద్వారం, నవమి కల్యాణ వేదిక, భక్తుల గ్యాలరీల మధ్య సమతుల్యం ఉండేలా మిథిలా స్టేడియాన్ని యాంఫీ థియేటర్ తరహాలో నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భారీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కొత్తగా యాంఫీ థియేటర్ లేదా ఓపెన్ ఎయిర్ థియేటర్ తరహాలో మిథిలా స్టేడియాన్ని నిర్మిస్తే గ్యాలరీల దిగువ భాగాన వచ్చే స్థలంలో భజన మందిరం, భక్తుల వసతి, డార్మిటరీ, క్లోక్‌రూం వంటి ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు ఆస్కారం ఏర్పడుతుందని సూచిస్తున్నారు.

రామయ్య సాక్షిగా ఐదో హామీ



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ ప్రియాంక అల, ఎమ్మెల్యేలు వెంకట్రావు, కనకయ్య

- నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి

భద్రాచలం: భద్రాచలం సీతారామచంద్రస్వామి సాక్షిగా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ ప్రభుత్వ ఐదో హామీ 'ఇందిరమ్మ ఇండ్లు'పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాచలంలో జరుగుతున్న సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆదివారం సాయంత్రం వచ్చిన ఆయన మార్కెట్ యార్డులో పరిశీలించారు. పథకం ప్రారంభోత్సవానికి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అభయహస్తం కార్యక్రమంలో ఆరు హామీలను పేర్కొనగా, ఇప్పటికే నాలుగు హామీలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చామని తెలిపారు. ఐదో హామీ ఇందిరమ్మ ఇండ్లను భద్రాది రామయ్య సన్నిధిలో సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ పథకంలో తొలి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను పేదలకు మంజూరు చేస్తామన్నారు. గ్రామసభల ద్వారా అర్హులను గుర్తిస్తామని, మొదట విడత ఇళ్ల స్థలం ఉన్న వారికి, రెండో విడతలో ఇళ్ల స్థలం లేని వారికి పథకం వర్తింపచేస్తామని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఇళ్లను మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో, జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని, ఏజెన్సీలో ఉన్న వారికి సైతం అందచేస్తామని పేర్కొన్నారు. తొలుత గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శరత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, కలెక్టర్ ప్రియాంక అల పూల మొక్కలను ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ నాయకులు పోరిక బలరాం నాయక్, మువ్వా విజయ్‌బాబు, పొదెం వీరయ్య, బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర, జిల్లా యంత్రాంగం ఆదివారం పర్యవేక్షించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక హామీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో అధికార యంత్రాంగం భద్రాచలం చేరుకుని ఏర్పాట్లు చేస్తోంది. బందోబస్తు ఏర్పాట్లు, అధికారులతో జరిగే సమీక్ష సమావేశం వేదికలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్, కలెక్టర్ ప్రియాంక అల, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్ రాజ్‌లు పరిశీలించారు. కాగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ ముందస్తుగా చర్యలు చేపట్టింది.

సభా వేదికను పరిశీలించిన మంత్రి

మణుగూరు రూరల్ : మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న ప్రజాదీవెన సభా వేదికను, ప్రాంగణాన్ని, హెలిప్యాడ్స్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, మాజీ ఎంపీ పోరిక బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలతో కలిసి సందర్శించి పరిశీలించారు. ప్రజాదీవెన ఏర్పాట్లకు సంబంధించి పూర్తి వివరాలను ఆయన సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, నాగసీతారాములు, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు చందా సంతోష్, కాటిబోయిన నాగేశ్వర రావు, బట్టా విజయ్‌గాంధీ, నవీన్ పాల్గొన్నారు.

బీజేపీలోకి జలగం, సీతారాం నాయక్



బీజేపీలో చేరిన జలగం , సీతారాంనాయక్

చుంచుపల్లి: కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ ఆదివారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నారు. మాజీ సీఎం జలగం వెంగళరావు తనయుడు వెంకట్రావు 2004లో సత్తుపల్లి నుంచి తొలిసారిగా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో ఖమ్మం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్తగూడెం నుంచి టీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి రెండో స్థానంతో సరిపుచ్చుకున్నారు. ఇక మాజీ సీఎం కేసీఆర్‌కు మొదటినుంచి సన్నిహితుడుగా ఉన్న ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ 2014లో మహబూబాబాద్ ఎంపీగా గెలుపొందారు. ఆ తర్వాత 2019లో టికెట్ నిరాకరించినా విధేయుడిగా పార్టీలోనే కొనసాగుతున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉండటంతో కమలం పార్టీ నేతలు ఆయన్ను కలిసి ఆహ్వానించడంతో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గాల నుంచి జలగం, సీతారాం నాయక్‌లను బరిలో నిలిపేందుకు బీజేపీ అధిష్టానం సన్నద్ధమైంది. నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఈవీ రమేష్, ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్సిటీ వచ్చేనా?

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కలగానే యూనివర్సిటీ ఏర్పాటు
- పీజీ, పీహెచ్‌డీలకు ఓయూ, కేయూలకు వెళ్లలేకపోతున్న విద్యార్థులు
- నలభై ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పాలకులు
- నేడు భద్రాద్రిలో పర్యటించనున్న సీఎం స్పందిస్తారని ఆశాభావం



ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద కళాశాలగా పేరున్న ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కాలేజీ

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు కలగానే మిగులుతోంది. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు అర్హతలు, అవకాశాలు ఉన్నా.. నాలుగు దశాబ్దాలుగా పోరు సాగుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎం స్పందిస్తారని ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

వైఎస్ హయాంలో ప్రతిపాదనలు..

యూనివర్సిటీ లేకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించలేకపోతున్నారు. పీజీ, పీహెచ్‌డీ చేయాలంటే ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు వెళ్లాలి. దీంతో అనేకమంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మరికొందరు దూరవిద్యావిధానం వైపు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటుకు 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ప్రతిపాదన పెట్టారు. ఆ తర్వాత ఆ యూనివర్సిటీని ఆదిలాబాద్‌కు తరలించారు. దీంతో విద్యార్థులకు నిరాశే ఎదురైంది. ఆ తర్వాత ఆదిలాబాద్‌లో కూడా ఏర్పాటు కాలేదు. ఇక గిరిజన యూనివర్సిటీ ములుగులో ఏర్పాటు చేశారు. ఇక్కడ యూనివర్సిటీ ఆవశ్యకతపై ఎవరూ పట్టించుకోకపోవడం వల్లే ఇలా జరిగిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళనలు

యూనివర్సిటీ కోసం విద్యార్థి సంఘాలు 40 ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నాయి. దీంతో ఖమ్మంలో యూనివర్సిటీ సబ్ క్యాంపస్‌ను మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లా ఇప్పటివరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉండగా, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో కలపాలని ప్రయత్నాలు చేశారు. ఇందుకు నిరసనగా విద్యార్థి సంఘాలు ఉద్యమించడంతో ఆ ప్రతిపాదనలు నిలిచిపోయాయి. కాగా యూనివర్సిటీ ఏర్పాటుకు పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రాలు సమర్పించారు. కాగా ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి యూనివర్సిటీ ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

అర్హతలు, అవకాశాలు ఉన్నా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన వసతులు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ స్థలాలు, కళాశాలలు, విద్యార్థులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు లక్ష మంది వరకు ఉమ్మడి జిల్లాలో విద్యనభ్యసిస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ ఏర్పాటుకు 200లోపు కళాశాలలు ఉండాలి. కాగా ఉమ్మడి జిల్లాలో 146 డిగ్రీ, 9 పీజీ, 4 బీఈడీ, డైట్, లా కళాశాల ఒక్కోటి చొప్పున ఉన్నాయి. అతిపెద్ద కళాశాలగా ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్‌కు గుర్తింపు ఉంది. సుమారు 5 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. మరోవైపు జిల్లాలో వందల ఎకరాల భూమి కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు లాభదాయకంగా ఉంటుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుంది.

జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా కూడా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. పలుమార్లు ఆందోళనలు చేపట్టినా, అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా యూనివర్సిటీ మంజూరు చేయాలి.

–వంగూరి వెంకటేష్, పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలి



ఖమ్మం కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొంది. తక్షణమే వర్సిటీ ఏర్పాటుకు జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలి. అనేక మంది ముఖ్యమంత్రులు సైతం యూనివర్సిటీ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించినా ఆచరణలోకి రాలేదు.

–ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి

ఖమ్మానిది ఘనమైన చరిత్ర

- ఖమ్మం అభివృద్ధికి ఎంతో మంది కృషి చేశారు
- సాగర్ నీటి సరఫరాతో జిల్లా అన్ని రంగాల్లో పురోగమించింది
- మాజీ సీజేఐ ఎన్.వి.రమణ



జస్టిస్ ఎన్.వి.రమణ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న మంత్రి తుమ్మల తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మం జిల్లా అంటే చైతన్యం కలిగిందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, ఈ జిల్లాది ఘనమైన చరిత్ర అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.రమణ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణమండపంలో కమ్మ మహాజన సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షతన ఎన్.వి.రమణ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రమణ, శివమాల దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు జిల్లాలో కోర్టు భవనాలు నిర్మించాలని ప్రతిపాదించానని, అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయని, భారతదేశంలో న్యాయవ్యవస్థకు అంతగా ప్రాధాన్యత లేదనడానికి ఇదొక నిదర్శనమని ఎస్.వి.రమణ అన్నారు. పదవిలో, అధికారంలో ఉన్న సమయంలో సన్మానాలు, సత్కారాలు సహజమని, తాను ఉద్యోగ విరమణ పొందిన ఏడాదిన్నర తర్వాత కూడా సన్మానం చేయడం హర్షణీయమంటూ ఆయన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో అనేక మంది తన మిత్రులు, సహచరులు స్థిరపడ్డారని, ఈ ప్రాంతానికి తన స్వగ్రామం చాలా దగ్గరగా ఉంటుందని అన్నారు. చీఫ్ జస్టిస్‌గా ఉన్న సమయంలో తాను ఈ జిల్లా నుంచి ముగ్గురిని హైకోర్టు జడ్జిలుగా నియమించానని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని, గ్రంథాల్లో జిల్లాకు అనేక పేర్లు ఉన్నాయని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య రాసిన వీరతెలంగాణ విప్లవ పోరాటం పుస్తకం చదివితే ఈ ప్రాంతంలో సంచరించినట్లు, సాయుధ పోరాట అనుభవాలు, కథలు కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జలగం వెంగళరావు, శీలం సిద్ధారెడ్డి, కమ్యూనిస్టు నేతలు బోడెపూడి వెంకటేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, రజబ్ అలీ, చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, మంచికంటి రామకిషన్‌రావు తదితర నాయకులు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. తుమ్మల నాగేశ్వరరావు కూడా జిల్లా అభివృద్ధికి పని చేసిన మంచి నాయకుడని అన్నారు. సమాజంలో అసమానతలు పెరిగితే సంపద, అధికారాన్ని అనుభవించలేమని చెప్పారు. నాగార్జునసాగర్ నీరు వచ్చిన తర్వాత ఈ ప్రాంతం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందిందని, మరింతగా అభివృద్ధి చెందేందుకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వారికి గౌరవం తెచ్చిన వ్యక్తి ఎస్.వి.రమణ అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ నామ నాగేశ్వరరావు సమ్మేళనానికి హాజరు కాలేకపోయామని, ఎస్.వి.రమణ పట్ల తమకున్న గౌరవాన్ని తెలియజేస్తూ సందేశాన్ని పంపించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టీడీపీ బాధ్యులు వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ బాధ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, సీపీఎం జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి యర్రా శ్రీకాంత్, పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సఖి కేంద్రం నిర్వహణకు ఎన్జీవోల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి విజేత తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు దరఖాస్తులు అందజేయాలని, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ రూం నంబర్-1లో ఉన్న జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇసుక లారీ పట్టివేత

దమ్మపేట: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ లారీని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మందలపల్లి రాష్ట్రీయ రహదారిపై శనివారం రాత్రి సమయాన పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న లారీని పట్టుకుని విచారించగా.. ఆంధ్ర ప్రాంతం నుంచి ఇసుకను తీసుకొస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. లారీని స్టేషన్‌కు తరలించి ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 594 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.16,800, 400 మంది బోటుషికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.21,130 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి: కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత బహిరంగ వేలం సోమవారం ఉదయం 11 గంటలకు సంత ఆవరణంలో నిర్వహించనున్నట్లు జీపీ ప్రత్యేకాధికారి రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీసా చట్టం ప్రకారం పంచాయతీ పరిధిలోని ఎస్టీలు మాత్రమే అర్హులని, వేలంలో పాల్గొనే వారు కుల ధ్రువీకరణ పత్రం, ధరావత్ నగదు రూ.30 లక్షలు, సాల్వెన్సీ కింద రూ.5 లక్షలను డీడీ లేదా నగదు రూపేణా చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొనే పాటాదారుడు గ్రామ పంచాయతీకి ఎలాంటి బకాయి ఉండొద్దన్నారు.

పండితాపురంలో 144 సెక్షన్

పండితాపురం సంత బహిరంగ వేలం దృష్ట్యా గ్రామంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సంత ఆవరణలోకి కేవలం వేలం పాటాదారులు మాత్రమే హాజరుకావాలని, ఇతరులు ఎవరూ రావొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

కొత్త సర్కార్‌పైనే ఆశలు..!

- అటకెక్కుతున్న డివిజన్, మండలాల ఏర్పాటు ప్రక్రియ
- అన్ని సౌకర్యాలున్నా.. అడుగడుగునా ఆలస్యమే
- ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రాంత వాసులు
- నేడు జిల్లాలో పర్యటించనున్న సీఎం, మంత్రులు


ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం

ఇల్లెందు: ఇల్లెందు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, మరో రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన గత ప్రభుత్వ హామీలు అటకెక్కాయి. గత ఎన్నికలకు ముందు ఇల్లెందు బహిరంగ సభలో పాల్గొనేందుకు విచ్చేసిన రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే సమస్య ఉత్పన్నమవడంతో వెనుదిరగగా.. మరో హెలికాప్టర్ ద్వారా ఇల్లెందుకు వచ్చిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో రెండు కొత్త మండలాలు, డివిజన్ కేంద్రం ప్రకటిస్తామని నిండుసభలో హామీ ఇచ్చారు. అయితే నేడు(సోమవారం) సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు భద్రాచలం, మణుగూరులకు రానున్న తరుణాన గత ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తున్న స్థానికుల్లో ఆశలు మళ్లీ రేకెత్తించాయి.

ఏళ్లుగా ఎదురుచూపులు..

గత ప్రభుత్వ పాలన నుంచి నేటి వరకు ఏర్పాటు చేస్తానన్న కొత్త డివిజన్, రెండు మండలాల ఏర్పాటులో తీవ్రజాప్యం జరుగుతోంది. ఎన్నో అనుకూలతలున్నా.. అడుగడుగునా నిర్లక్ష్యం ఆవరించుకుంటుంది. ఇక్కడి నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులు పట్టుదలకు పోకపోవడమో లేక సీఎంల దృష్టికి తీసుకెళ్లపోవడమో గానీ ఇల్లెందు కేంద్రంగా నూతన డివిజన్, కొమురారం, బోడు అనే రెండు కొత్త మండలాలు ఏర్పాటు ప్రక్రియ అటకెక్కుతోంది. గత ఐదేళ్లుగా అదిగో.. ఇదిగో.. అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. నేటి సీఎం పర్యటనలోనైనా ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజలు ఆశగా నెరవేరుతాయో లేదో చూడాలి.

అన్నీ అనుకూలతలే..

కొమురారం మండలం ఏర్పాటుచేస్తే కొత్తగా తహసీ ల్దార్ కార్యాలయం, వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కాని ఇప్పటికే కొమురారం పరిధిలో కాచనపల్లి పోలీస్‌స్టేషన్, కొమురారంలో హైస్కూల్, ఆంధ్రాబ్యాంక్, ఏపీజీవీబీ మినీ బ్రాంచ్, పశువైద్యశాల, ఫారెస్టు రేంజ్ కార్యాలయం, సబ్ పోస్టాఫీస్ కార్యాలయం, కొమురారం, పోలారం, మాణిక్యారంలో మూడు యూపీఎస్, రొంపేడులో గిరిజన బాలికల ఆశ్రమ హైస్కూల్, ఎస్‌బీఐ బ్రాంచీ, కొమురారం, రొంపేడులో రెండు పీహెచ్‌సీలు, కొమురారం, మాణిక్యారంలో రెండు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇల్లెందు నుంచి కొమురారం 16 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. కొమురారం, మర్రిగూడెంలలో రెండు పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఇక బోడు మండలం ఏర్పాటుకు కూడా పోలీస్‌స్టేషన్, హైస్కూల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల కోసం భవనాలు ఉన్నాయి. పూర్వపు తాలూకా, సమితి కేంద్రమైన ఇల్లెందును ఆర్డీఓ కేంద్రంగా ప్రకటించడానికి అన్ని అనుకూలతలు ఇల్లెందుకు ఉన్నాయి.

డివిజన్ కేంద్రంలో ఆరు మండలాలు..

కొమురారం, బోడు రెండు కొత్త మండలాలు ఏర్పాటుచేస్తే ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాలు ఇల్లెందు మున్సిపాలిటీ డివిజన్ కేంద్రం పరిధిలోకి వస్తాయి. డివిజన్ కేంద్రం ఏర్పాటు అయితే డివిజన్ స్థాయి అధికారులు ఇల్లెందులో ప్రజలకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది.


కొమురారం గ్రామం

తపాలా శాఖ ఆధ్వర్యంలో లెటర్ రైటింగ్ పోటీలు


లెటర్ రైటింగ్ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ ఫర్ యంగ్ పీపుల్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ ఏర్పడి 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భవిష్యత్ ప్రపంచం ఏవిధంగా ఉండాలని కోరుకుంటున్నారనే అంశంపై వివిధ స్థాయిల్లో పాఠశాల విద్యార్థులకు లెటర్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలతో పాటు జిల్లా నలుమూలలకు చెందిన పాఠశాలల విద్యా ర్థులు 205 మంది పాల్గొన్నారు. ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు హైమావతి, విజయలక్ష్మి, సత్యావతి, శిరీష, శ్రీవల్లి, ఆర్‌వీఎస్‌ఎస్ చార్యులు, భార్గవ్, శ్రీకాంత్, పుల్లారావు, నాయుడు, సురేశ్, కోటేశ్వరరావు, పమ్మి వెంకటేశ్వరరావు, మల్లికార్జున్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. రెండేళ్లుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు బహుమతులు సాధించారని, దీంతో కాంపిటీషన్‌కు పోటీ పెరిగిందని పోస్టల్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు.

కార్పొరేషన్ ఏర్పాటును విస్మరించిన బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న డాక్టర్ దేవయ్య

ఖమ్మంమామిళ్లగూడెం: గత ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటును విస్మరించిందని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దేవయ్య, ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ ఆరోపించారు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 12న జరిగే కేబినెట్ సమావేశంలో మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో హైదరాబాద్‌లో సింహగర్జన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పారా నాగేశ్వరరావు, కనిశెట్టి విజయ్ కుమార్, శ్రీనివాసరావు, పూర్ణచందర్‌రావు, రవి, బండి సంజీవ్, పారా ఉదయ్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రకటన చేయాలి

- ఉమ్మడి జిల్లాలో ఐఐఎం కోర్సు ఏర్పాటుకు కృషి చేయాలి
- పోడు సమస్య పరిష్కరించండి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

సింగరేణి(కొత్తగూడెం): భద్రాద్రి జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన విధానం ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ కోరారు. ఆదివారం ఆయన కొత్తగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి భద్రాచలం రావడాన్ని స్వాగతిస్తున్నామని, జిల్లా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసినా సరైన వైద్య పరికరాలు, సిబ్బంది లేరని, సౌకర్యాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. పరిశ్రమలకు కేంద్రబిందువైన జిల్లాలో అసంఘటిత రంగానికి అండగా ఉంటూ కనీస వేతనాలు అమలు చేయాలని, ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇస్తామని మాట ఇచ్చిన గత ప్రభుత్వం చివరకు మొండిచేయి చూపిందన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వమైనా సానుకూలంగా స్పందించాలని, జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న విలేకరులందరికీ స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలకు హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐఐఎం కోర్సు ఏర్పాటుకు కృషి చేయాలని, జిల్లాలో గిరిజన, మైనింగ్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. భద్రాద్రి జిల్లాలో 84 వేల మంది పోడు సాగుదారులు 2.90 లక్షల ఎకరాలకు దరఖాస్తు చేసుకోగా, 50 వేల మందికి 1.50 లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చారని, మిగిలిన వారికీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తిచేసి, జిల్లాలో రైతులకు నీరందించేలా చూడాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, ఎంబీ నర్సారెడ్డి, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

61 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు.. కారు సీజ్


జూలూరుపాడు: పట్టుబడిన నిందితులతో పోలీసులు

జూలూరుపాడు: ఇద్దరు వ్యక్తులు నిషేధిత గంజాయితో కొత్తగూడెం వైపు నుంచి ఖమ్మం వైపు కారులో వెళ్తున్న ఓ కారును పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి చెప్పారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం జూలూరుపాడు ఇన్‌చార్జి ఎస్సై మాచినేని రవి పోలీస్ సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీ చేస్తున్నాడు. ఈక్రమంలో మారుతి బొలెరో కారులో ఇద్దరు వ్యక్తులు నిషేధిత గంజాయితో పట్టుబడినట్లు తెలిపారు. ఆ ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 61 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి విలువ రూ.12.25 లక్షలు ఉంటుందన్నారు. విచారణలో హైదరాబాద్ గోషామహల్‌కు చెందిన దత్తాత్రేయ ఉపాధ్యాయ, రామారావు బిలాదర్ వద్దకు తరలిస్తున్నట్లు తెల్పిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కారాదని, డ్రగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అవినీతి, అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు..

పాల్వంచరూరల్: ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచలోని ఇందిరనగర్‌కాలనీ, సోములగూడెంకు చెందిన ముగ్గురు యువకులు గత రెండ్రోజుల క్రితం ఒరిస్సా నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై బి.శ్రీనివాస్ శనివారం రాత్రి సోములగూడెంలో ఒక ఇంట్లో రహస్యంగా ఉన్న ముగ్గురు యువకులను పట్టుకోవడంతో పాటు కొంత ఎండు గంజాయిని కూడా స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీరు చోరీ చేయకుండా కాల్వ గట్లపై పహారా

నేలకొండపల్లి: ఖమ్మం నగర ప్రజలకు తాగునీటి కోసం సాగర్ జలాలను విడుదల చేయటంతో వాటిని చోరీ చేయకుండా పోలీసులు, ఇరిగేషన్ అధికారులు గస్తీ కాస్తున్నారు. సాగర్ జలాలను పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మానికి సాగర్ కెనాల్ ద్వారా సరఫరా చేస్తున్నారు. కాగా, మండలంలోని రాజేశ్వరపురం వద్దనున్న నందిగామ బ్రాంచ్‌కెనాల్ లాక్‌ల సమీపంలో పోలీసులు, ఇరిగేషన్ సిబ్బంది రాత్రింబవళ్లు పహారా కాస్తున్నారు. రాత్రి నేలకొండపల్లి ఎస్‌ఐ నాగరాజు సిబ్బందితో కాలువ కట్టపై పెట్రోలింగ్ నిర్వహించారు.

సాహితీ సదస్సులో కవులు

అశ్వారావుపేటరూరల్: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ ఆమెరికా ఆధ్వర్యంలో ఏపీలోని కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన సాహితీ సదస్సుకు అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ సిద్దాంతపు ప్రభాకరాచార్యులు, సామాజిక మాధ్యమ కవి, విశ్లేషకులు మడిపల్లి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. వేదికపై ప్రభాకరాచార్యులు కాళికాంటా సప్తశతిలో ప్రకృతి తత్వంపై పత్రాన్ని సమర్పించగా, అంతర్జాతీయంగా పలు దేశాల నుంచి వచ్చిన కవులచే నిర్వహించిన కవి సమ్మేళనంలో మడిపల్లి వెంకటేశ్వరరావు కవితా గానం చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ స్థాయి సదస్సులో తమకు ఇలాంటి అవకాశందక్కడం సంతోషకరమని అన్నారు.

68 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


పట్టుబడిన లారీ

తిరుమలాయపాలెం: లారీలో అక్రమంగా తరలిస్తున్న 68 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం టాస్క్‌ఫోర్స్, తిరుమలాయపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన మడికంటి రామయ్య రేషన్ బియ్యాన్ని ఎర్రగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం మీదుగా తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. లారీడ్రైవర్ నర్రా పెద్దులును అదుపులోకి తీసుకున్నారు. మడికంటి రామయ్య, లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గొల్లగూడెంలో 15 క్వింటాళ్లు ...

అశ్వాపురం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని గొల్లగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద ఆదివారం సీఐ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో మణుగూరు నుంచి పాల్వంచ వెళ్తున్న టాటా మేజిక్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. దీంతో వాహనంలో తరలిస్తున్న సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడగా.. బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు


దమ్మపేట: ఓ మైనర్‌ను అసభ్యకరమైన రీతిలో వేధిస్తున్న యువకుడిపై పోలీసులు ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక సత్తుపల్లి మండలంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదువుతోంది. ఈ క్రమంలో సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు గత నాలుగు నెలల నుంచి ఆ మైనర్‌ను వెంబడిస్తూ.. అసభ్యకరరీతిలో వేధిస్తున్నాడు. దీంతో ఆ మైనర్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పాత గొడవల నేపథ్యాన వ్యక్తిపై దాడి

దమ్మపేట: పాత గొడవల నేపథ్యాన ఓ వ్యక్తిపై భౌతిక దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికిశోర్ కథనం ప్రకారం.. మండలంలోని నాచారం గ్రామానికి చెందిన సాధు మహేశ్ అదే గ్రామానికి చెందిన జగన్‌కు పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి జగన్ మరో ఆరుగురు వ్యక్తులతో కలసి మహేశ్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మహేశ్ తలకు గాయమై రక్తస్రావం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

-ఖమ్మం, మహబూబాబాద్ జిల్లా వాసులు మృతి


రాజిరెడ్డి (ఫైల్)


షబ్బీర్(ఫైల్)

ఖమ్మంరూరల్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ఈగ రాజిరెడ్డి (37), మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనుగుర్తికి చెందిన షేక్ షబ్బీర్ (35) కలిసి గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారు. వారం రోజుల కిందట వీరు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఓ గ్రానైట్ క్వారీ నుంచి రాయిని తీసుకుని ఖమ్మం వస్తుండగా మార్గమధ్యలో మూలమలుపు వద్ద లారీ అదుపుతప్పింది. ఈ క్రమంలో గ్రానైట్ రాళ్లు క్యాబిన్‌పై పడటంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా షబ్బీర్ ఐదేళ్లుగా వరంగల్‌క్రాస్‌రోడ్డులో కుటుంబంతో నివాసముంటున్నాడు. రాజిరెడ్డి ఖమ్మం నగరంలోని సారథినగర్‌వాసి.


రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: మానసికస్థితి బాగాలేని ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఖమ్మం నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొత్తగూడెంలోని బూడిదగడ్డకు చెందిన ఠాకూర్‌విజయ్‌సింగ్ (41) నాలుగేళ్లపాటు ఆర్మీలో పనిచేశాడు. మానసికస్థితి బాగాలేకపోవటంతో ఆర్మీ తిరిగి పంపించింది. ఆదివారం ఉదయం ఖమ్మం వచ్చిన ఆయన రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆధార్ కార్డు ద్వారా రైల్వే పోలీసులు వివరాలు సేకరించి, ఆయన అల్లుడు దినేశ్‌సింగ్‌కు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు బృందం మార్చురీకి తరలించింది. జీఆర్‌పీ ఎస్‌ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఆటోడ్రైవర్..

బూర్గంపాడు: భార్యాభర్తల గొడవల నేపథ్యాన ఓ ఆటోడ్రైవర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బిల్లా రాంబాబు(34)కు, బూర్గంపాడులోని గౌతమిపురం కాలనీకి చెందిన అరుణతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇరువురు ఆడపిల్లలు ఉండగా.. ఇటీవల వీరి మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యాన భార్య అరుణ తన పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. భార్య పుట్టింట్లోనే ఉండడంతో రాంబాబు కూడా గౌతమిపురం వెళ్లి అక్కడ ఒక నెలరోజుల పాటు ఉన్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 7వ తేదీన వారిమధ్య మళ్లీ గొడవ జరుగగా.. ఆయన భార్య, అత్త, బావమరుదులు రాంబాబుపై భౌతికదాడికి పాల్పడ్డారు. దీంతో రాంబాబు తన సొంతూరుకు వెళ్లగా.. ఈ నెల 9వ తేదీన అరుణ మోరంపల్లిబంజరకు వెళ్లి భర్తపై గొడవపడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాంబాబు ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగభిక్షం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో...


రవికుమార్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు కథనం ప్రకారం.. యాతాలకుంటకు చెందిన పడుగు రవికుమార్ (38) కొత్తగా ఇల్లు నిర్మించి అప్పుల పాలయ్యాడు. శనివారం రాత్రి పురుగులమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మితిరుపతమ్మ, కుమారులు గురుచరణ్‌తేజ, రేవంత్‌కుమార్ ఉన్నారు. మృతుడి తమ్ముడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.